నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అధికారులకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం కాచిగూడ డివిజన్‌లో అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ప్రగతి సాధిస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు కార్పొరేషన్‌లో నెలకొన్న పలు సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

- లింగంపల్లి చౌరస్తా సమీపంలో గత కొంత కాలంగా డ్రైనేజీ పొంగడంతో స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.
- భూమన్న లేన్‌లో ఎమ్మెల్యే పర్యటించి నూతన సీసీ రోడ్డు వేయాలని, దీనికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.
- గత పాలకుల వల్లే నియోజకవర్గం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రభుత్వ పథకాలను అందించడంలో పట్టించుకోలేదని ఆరోపించారు.
- ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. నీటి కాలుష్య సమస్యకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామన్నారు. జలమండలి అధికారులు డీఈ సన్యాసిరావు, ఏఈ భావన, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్గుల రామకృష్ణారావుకు ఘన నివాళి


బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్: హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు 56వ వర్ధంతిని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ఫౌండేషన్ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ బుసాని వెంకటేశ్వర్‌రావు, బూర్గుల లక్ష్మణ్‌నారాయణరావు, జేబీ బాబురావుతో పాటు పలువురు పాల్గొని నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అండగా ఉంటానని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మల్లికార్జుననగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీనివాసన్ మునిస్వామి రాధ అద్దంకి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ట్రస్ట్ సహకారంతో నోట్‌బుక్స్ పంపిణీకి చొరవ తీసుకుంటున్నారు. ట్రస్ట్ ప్రతినిధులు శరత్, బీజేపీ గ్రేటర్ మాజీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నాయకులు చుక్క జగన్, రమేష్ ముదిరాజ్, అచ్చిలి రమేష్, మిర్యాల శ్రీనివాస్, వెంకటేష్‌ముదిరాజ్ తదితరులున్నారు.

రామాలయ ట్రస్ట్ నూతన కమిటీ


ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

అంబర్‌పేట: ఆలయ ట్రస్ట్‌కు నూతన కమిటీ ఏర్పాటైంది. కాచిగూడ చాదర్‌ఘట్ బ్రిడ్జి సమీపంలోని రామాలయం, కల్యాణ మండపం ట్రస్ట్ గురువారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ట్రస్ట్ అధ్యక్షులు, చైర్మన్‌గా కె.కృష్ణ, ఉపాధ్యక్షులుగా కేఎం. సంతోష్, కార్యదర్శిగా కె.వి జయసాయి, కోశాధికారిగా మహేష్, సంయుక్త కార్యదర్శిగా ఎం. ప్రతాప్‌లు ఎన్నికయ్యారు. ట్రస్టు ప్రతినిధులు బాగయ్య, చెరుకు కిషన్, రాజేందర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అభినందన



అంబర్‌పేట: కవితల పోటీల్లో అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎస్సై రాంచంద్రరాజు జాతీయ పురస్కారాన్ని అందుకోవడంతో అతడిని ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్‌దత్ అభినందించారు. గురువారం డీసీపీ కార్యాలయంలో ఎస్సైని అభినందించి సాహిత్యంపై అభిరుచి పెంచుకుని జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం హర్షనీయమన్నారు. ఆర్యాణీ కళావేదిక, గౌతమేశ్వరా కళా సమితి సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో రాంచందర్‌రాజుకు జాతీయ పురస్కారాన్ని ఇటీవల అందజేశారు. ఏసీపీ కె.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులున్నారు.

రజకులకు చెరువులపై హక్కు కల్పించాలి


మాట్లాడుతున్న రజక ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ సైదులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రజకులకు చెరువులపై హక్కును కల్పించాలని రజక ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ అమనగంటి సైదులు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం రజక ఫిషర్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమనగంటి సైదులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకులను ఫిషర్‌మెన్‌లుగా గుర్తిస్తూ.. జీవోనెంబర్ 343ని విడుదల చేసిందని ఆ జీవోను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రజకులకు రాష్ట్ర మత్స్యశాఖ నుంచి గుర్తింపుకార్డు ఇవ్వడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలని కోరారు. రజక సంఘం నాయకులు సంపత్, రజక సేవా అధ్యక్షుడు పెద్దాపురం కుమారస్వామి, రాజకుమార్, ఆంజనేయులు, నేరేళ్ల కుమార్, ఉప్పల యాదయ్య, శివకుమార్, రాగాల రమేష్, నేరేళ్ల రాజు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


అధికారులతో కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకం శ్రద్ధ తీసుకుని కృషి చేస్తున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డివిజన్‌లోని రోడ్లు అధ్వానంగా తయారై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నాని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యాత్మక ప్రాంతాల్లో డీఈ గీత, ఏఈ సలామ్‌లతో కలిసి గురువారం పర్యటించారు. ఈ మాట్లాడుతూ.. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన పూడికను తొలగించాలన్నారు. నేతలు వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, ఉమేష్, సత్తిరెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

ముషీరాబాద్: రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన సీఎం కేసీఆర్‌ను బీజేపీ నేతలు విమర్శించడం సరికాదని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిరసన దీక్ష చేపట్టడాన్ని ఆయన ఎద్దేవ చేస్తూ.. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్నాయా.. అని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, దళితబంధు, కేసీఆర్ కిట్స్, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా బీజేపీ చౌకబారు విమర్శలు, ఆందోళనలు మాని రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలపై సమీక్ష

చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధిగాంచిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో ఈనెల 18వ తేదీ నుంచి స్వామి వారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, కార్యనిర్వాహణాధికారి పాశం లక్ష్మారెడ్డిలు ప్రకటించారు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 18 నుంచి 29వ తేదీవరకు గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవాలయానికి రంగులు, విద్యుత్ దీపాల అలంకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. 17వ తేదీన అంకురార్పణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరవుతారని వివరించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ.డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ ఎ.వినయ్‌కుమార్, రాజకీయ ప్రముఖులు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. భక్తబృందం సభ్యులు రమణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదానం

చిక్కడపల్లి: పేదలకు అన్నదానం చేయడం ఎంతో ఉత్తమమైందని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, సీనియర్ బీజేపీ నేత చర్ల గోపాల్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా ఆధ్వర్యంలో కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అన్నదాతలు నరసింహారావు, వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, బాలకుమార్, శ్రీనివాస్, బాలచందర్, రవీందర్‌గుప్తా, రమేష్, భిక్షపతి, సింగారపు శంకర్, మామిళ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: అనారోగ్యంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారీ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (45) ఉందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నెంబర్ 2 పైన అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్‌సెట్ పెట్టుకుని పట్టాలపై వెళ్తున్న యువకుడిని గూడ్స్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. బీహార్‌కు చెందిన రాహుల్ (22) యాకుత్‌పురలో నివాసం ఉంటూ.. కూలి పనిచేస్తుండేవాడు. యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..

కాచిగూడ: చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (45) ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణలక్ష్మి దేశానికే ఆదర్శం


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్

కాచిగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో అర్హులైన 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.30,03,480 చెక్కులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికభారం కావొద్దనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ముషీరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం బీజేపీ పార్టీ నైతిక బాధ్యత అని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ అన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. ముషీరాబాద్ ఎమ్మార్వో ఆఫీసు వద్ద 3వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన కేంద్రం వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చింతల కుమార్‌మాదిగ, జె.నాగరాజుమాదిగ, ప్రసాద్ మాదిగ, గందమళ్ల రమేష్, కట్ట కవిత, గిన్నారపు శ్యామ్‌రావు, ఎల్లయ్య తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు సలిపెల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డిలు అన్నారు. గురువారం సుందరయ్య పార్కులో యశోద ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో రెండ్రోజులకోసారి పాల్గొంటారని వివరించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. క్లబ్ ఉపాధ్యక్షులు కె.నర్సింహ్మా, వాకర్స్ సభ్యులు టి.సైకిలాబ్‌బాబు, కోట రమేష్, ఆర్.వెంకటరాములు, కృష్ణ యశోద ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు, పోలీసులు

కాచిగూడ: దేశ భవిష్యత్తు ఆరోగ్యవంతమైన యువతపైనే ఆధారపడి ఉంటుందని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని భవన్స్ న్యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ పేరాల కృష్ణారావు పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్‌ఏఎన్‌బీ) ఆధ్వర్యంలో కళాశాలలో 'మత్తు పదార్థాల వినియోగం – దుష్ప్రభావం' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చెడు స్నేహాలతో యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. టీఎస్‌ఏఎన్‌బీ సీఐ శ్రీనివాస్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మానసిక నిపుణులు అస్మిత, శ్రీముఖి, లహరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులున్నారు.

'సాయుధ పోరాట వారసత్వాన్ని లూటీ చేసే ప్రయత్నం'


కాచిగూడ: వేలాది మంది ప్రాణత్యాగాలు చేసి నిరంకుశ నిజాంను తరిమికొట్టిన కమ్యూనిస్టుల తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని బీజేపీ లూటీ చేసే ప్రయత్నం చేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆరోపించారు. గురువారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో ప్రముఖ ఉర్దూ జర్నలిస్టు షోయబ్ ఉల్లాఖాన్‌ను స్మరించుకుంటూ.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ.. బీజేపీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని లాక్కునే ప్రయత్నాలు చేస్తే తెలంగాణ ప్రజలు తరిమి కొడతారని అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం ఆనాడు నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలు నిర్వహించినట్లు నేడు కేంద్రానికి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు నిర్వహించాలని నారాయణ పిలుపునిచ్చారు. సీనియర్ సీపీఐ నేతలు వీఎస్ బోస్, ఈటీ నరసింహ, ఎస్.ఛాయాదేవి, యాదగిరి, స్టాలిన్, వెంకటేశం, ప్రేమ్‌పావని, ఆర్.శంకర్‌నాయక్, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, లతీఫ్, మహమూద్, కల్యాణ్, హరికృష్ణ తదితరులున్నారు.

పొలాల మాస, బొడ్డెమ్మ పండుగ సంబరాలు



మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

ముషీరాబాద్: ఎడ్ల పొలాల మాస, బొడ్డెమ్మ పండగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాల శ్రీనివాస్‌పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిన విధంగానే ఎడ్ల పొలాల మాస, బొడ్డెమ్మ పండగను నిర్వహించాలన్నారు. గురువారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల పొలాల మాస, బొడ్డెమ్మ పండగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు పాల్గొని ఎద్దులకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాలతో ట్యాంక్‌బండ్‌పై ఊరేగించారు. డాక్టర్ బాల శ్రీనివాస్ పటేల్, మాజీ ఎమ్మెల్యే పుట్టామధు, మున్నూరు కాపు సంఘం నేతలు సర్దార్ పుట్టా పురుషోత్తం హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల శ్రీనివాస్‌పటేల్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ ఆధారితంగా జీవనం సాగిస్తున్న మున్నూరు కాపులు ఎడ్ల పొలాల మాస, బొడ్డెమ్మ సంబరాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ వస్తుందని, వ్యవసాయాన్ని నమ్ముకొని ఎంత అభివృద్ధి చెందినా ఈ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. గురువారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వ సహకారంతోనే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 45 లక్షల మంది మున్నూరు కాపులు ఈ పండగ నిర్వహిస్తున్నారన్నారు. మున్నూరు కాపు సంఘం నేతలు ఎనుముల సత్యనారాయణపటేల్, రాజుపటేల్ శ్రవణ్‌కుమార్‌పటేల్, రాజేష్, నేతి మంగమ్మ, రజిత, మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన


కిషన్‌రెడ్డి దీక్షలో శేషసాయి, కృష్ణయాదవ్

ముషీరాబాద్: ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని, నిరుద్యోగులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షకు బీజేపీ నేతలు సంఘీభావం ప్రకటించారు. ఇందిరాపార్కు వద్ద దీక్ష చేస్తున్న కిషన్‌రెడ్డిని బలవంతంగా అరెస్టు చేసినప్పటికీ పార్టీ కార్యాలయంలో తన దీక్షను కొనసాగిస్తున్నారని ముషీరాబాద్‌నుంచి హాజరైన బీజేపీ సీనియర్ నాయకులు శేషసాయి, అడిక్‌మెట్ డివిజన్ మాజీ అధ్యక్షులు సాయికృష్ణయాదవ్‌లు తెలిపారు. ప్రభుత్వం నిర్బంధ చర్యలను మానుకోవాలని నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కును కాపాడాలని కోరారు.


పూలే చౌరస్తాలో నిరసన చేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ.. ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. నిరసన చేపట్టారు. అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం చారి, ఆనంద్‌గౌడ్, బిక్షపతి, యశ్వంత్, కృష్ణ ముదిరాజ్, యాదగిరి, నవీన్‌రెడ్డి, ఈశ్వర్ తదితరులున్నారు.

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో నిరసన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బీసీ కన్వీనర్ ఎం.ఉమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహారావు, రహమత్ అలీ, తేజస్వీ, నవీన్ కుమార్, యువమోర్చా నాయకులు ప్రశాంత్, సత్తి తదితరులున్నారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదల వైద్యానికి భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వ సహకారంతో తన చేతుల మీదుగా 1667 మందికి రూ.8.57 కోట్లను సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 27 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.40 లక్షలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లబ్ధిదారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సీఎంగా బీసీని ప్రకటించండి


వినతిపత్రం అందజేస్తున్న నీరడి భూపేష్‌సాగర్

కాచిగూడ: సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ కాంగ్రెస్ అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17న జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభలో పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించే మేనిఫెస్టోలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటించేలా పార్టీలో చర్చించాలని ఆయన కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు కోట్ల శ్రీనివాస్, గుజ్జ కృష్ణ, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

చెరువును తలపిస్తూ ..


వరద నీటితో నిండిపోయిన దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద గురువారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి ఆ ప్రాంతమంతా చెరువును తలపించేలా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుంది.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ


నూతన కమిటీ ప్రతినిధులు

అంబర్‌పేట: నియోజకవర్గం విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది. గురువారం గోల్నాకలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాలచారి, కోశాధికారిగా వినోద్‌కుమార్‌చారి, ప్రధాన సలహాదారులుగా శ్రీరామ్‌దాస్ సంజీవచారి, సీహెచ్ రామాచారి, అంజయ్యాచారి, శ్రీహరిచారి, సంపత్‌కుమార్ చారి, జయకుమార్, ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా గన్నోజీ కృష్ణచారి, కృష్ణమూర్తి, గోపాలాచారి, శ్రీగిరి వేణుగోపాలచారి. సీహెచ్ మహేష్‌చారి, కార్యదర్శులుగా రాజుచారి, సురేష్ తదితరులు ఎన్నికయ్యారు.

జానపద, గ్రామీణ కళలను వెలికితీయాలి

చిక్కడపల్లి: మరుగున పడిన జానపద, గ్రామీణ కళలను వెలికి తెచ్చి కళాకారులను ఆదుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. గురువారం త్యాగరాయగానసభలో 'మీతో మేము' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు జోగినిలు, కళాకారులు, గాయనీగాయకులను ప్రకృతి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నాగరత్నం నాయుడు మాట్లాడుతూ.. గ్రామీణ జానపద కళలు, కళాకారులు మరుగున పడిపోతున్నారని వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరిచి వారిని ఆదుకోవాలన్నారు. నిర్వాహకులు పల్లె ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. తమ సంస్థ ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. బుట్టి లావణ్య, జర్నలిస్ట్ రాజేంద్రప్రసాద్, శ్రీదేవి, చంద్రశేఖర్, బాలుయాదవ్, మంజుల రెడ్డి, శంకర్, ప్రకాష్‌ఠాకూర్ పాల్గొన్నారు.